
# కురుక్షేత్రం



ఎస్. ఆర్. రావు

"విన్నారా ఎన్నెన్ని మాట్లంటున్నారో నన్ను? చాకిరీకి చాకిరీ తప్పటం లేదు మాటలకి మాటలూ తప్పటం లేదు - యిహ నావల్ల కాదీ సంసారం యీదటం... ఏదో ఏర్పాటు చెయ్యాల్సిందే మీరు -" అంటూ ఎదురొచ్చింది కృష్ణవేణి.

అద్భుతమైన తెలుగు సినిమాలో అంతకంటే అద్భుతమైన రెండర్థాల పాటతో పచ్చి శృంగార దృశ్యాన్ని చూసి మేఘాల మీద తేలిపోతూ వచ్చిన అర్జునరావు భూమి మీదకు దిగి వచ్చాడు. అయోమయంగా భార్యవంక చూశాడు!...

"ఒకటా రెండా ఎన్ని మాటలు - నా కర్మ యిలా కాలింది - ఒకళ్ళని అని ఏం లాభం" అంటూ కళ్ళు తుడుచుకొని ముక్కు చీది, ఆ చేయి పమిట చెంగుకు తుడిచింది కృష్ణవేణి. రెండు పెగ్గులు వేసుకున్నవాడి నెత్తిమీద బకెట్ చన్నీళ్ళు దిమ్మరించినట్లు అర్జునరావు సినిమానిషా పూర్తిగా దిగి పోయింది. వాస్తవంలో హీరోయిన్లు సినిమా హీరోయిన్లంత గ్లామరస్‌గా వుండరనుకున్నాడు.

"ఏం జరిగింది మళ్ళీ" అన్నాడు నీరసంగా.

"యింకా ఏం జరగాలి?... నేనట చీరలకీ షోకులకీ డబ్బంతా తగలేస్తున్నానట - సినీమా అనీ షికార్లనీ తెగ తిరుగుతున్నానట - మిమ్మల్ని కొంగున ముడేసుకుని ఆ కొంగు నడుంచుట్టూ తిప్పి బొడ్లో దోపుకున్నానట! ఒకటా రెండా ఎన్నిమాటలు... చెవులు చిల్లులు పడిపోతున్నాయి..."

తన యిల్లని చెప్పుకుంటున్న ఆ గదిన్నర వాటాలో తను కాక యింట్లో వుంటున్నది - తన భార్య, తల్లీ, తండ్రీ, చెల్లీ - వెరసి ఐదుగురు! తన్ని తప్పిస్తే తన భార్యకు మిగతా ముగ్గురూ శత్రువర్గంలోని వాళ్ళు - మిగతా ముగ్గురికీ తన భార్య పరాయిదీ, పని చేయవలసిందీ, మాట పడవలసిందీను - యిరు

పక్షాల వారికీ తను అయినవాడూ, కావలసిన వాడూ కాబట్టి రెండు పార్టీలు కూడా తన్ని ఎడాపెడా వాయిస్తూ సాధిస్తూ వుంటారు! ఈ భాగోతానికి బాగానే అలవాటు పడ్డాడు అర్జునరావు.

"ఏదో ఏర్పాటు చెయ్యాలి మీరు! నేనీ మాటలు పడలేను... యింత కంటే ఏ విష మన్నా పుచ్చుకొని గుటుక్కుమంటం హాయి" అంది కృష్ణవేణి.

చస్తానని బెదిరించటం కృష్ణవేణికి కొత్త కాదు. లోగడ నూతిలోనో, గోతిలోనో పడతాననేది. పావుగంటన్నా నీళ్ళు రాని పంపులు కల మహా నగరంలో వుంటున్నప్పుడు - దూకాలంటే మాత్రం నూతులూ గోతులూ ఎక్కడున్నాయని ఆ బెదిరింపును ఖాతరు చేయలేదు అర్జునరావు. దరిమిలా స్లోగను మార్చి ఉరోసుకుని చస్తాననేది కృష్ణవేణి. ఆ మాటకి తను వుంటున్నయింటి కప్పువంక చూసి నవ్వుకునే వాడు అర్జునరావు. అరిచేతిమందాన నాజూగ్గా కట్టినగోడల మీద అంతకంటే నాజూకైన ఓ టిన్ను రేకు కప్పి గదిన్నర వాటాగా సృష్టించి-అటువంటి వాటాల్ని అటు ఆరు, యిటు ఆరు ఏర్పరచి మధ్యలో తనకి మాత్రం పక్కా సిమెంటు భవనం నిర్మించుకుని ఆ వాటాల్నీ, వాటాల్లో మనుషుల్నీ పరిపాలిస్తూ ఆ కాంపౌండుని ఏలుతున్న ఓ నరుడు సాక్షాత్తు యముని మేనత్త కొడుకు! ఉరోసుకోవటం మాట అటుంచి ఉట్టి కట్టుకుని అందులో రెండు చట్లుపెట్టుకొన్నా ఆ పైకప్పు కూలి నెత్తి మీద పడటం ఖాయం! అందుకని ఆ బెదిరింపునీ లెక్క చెయ్యలేదు అర్జునరావు. తర్వాత పల్లవి మార్చింది కృష్ణవేణి- యిప్పుడు నల్లుల మందు, పిల్లుల మందు అంటోంది! మొండి పట్టుదల మనిషి ఏ క్షణంలో ఏం చేస్తుందోనని యిప్పుడు కాస్త

## వచ్చేవారం:

- మహాకవి శ్రీశ్రీ చైనా పర్యటన విశేషాలు
- వేయి రేకులతో వికసించిన ఛాయాగ్రహణ కళ (ప్రత్యేక వ్యాసం) —బాబు
- గర్వం (కథ) —నిర్మల
- మనిషి (కథ) —వి.వి.ఆర్.శివకుమార్
- పాపపరిహారం (కథ) —విద్వాన్ దస్తగిరి
- ఇంద్రజాలిక అద్భుతాలలో ప్రాణాన్నే పణంగా పెట్టిన 'హుడినీ'!
- మహిమలతో వ్యాధులు నయమవుతాయా?
- సినీతంత్ర,
- బాలతంత్ర
- సావేరి
- రాజు - పేద

కయుపడుతున్నాడు అర్జునరావు భార్య చెపుతూనేవుంది...

''సరేలే నేను రేపు కనుక్కుంటాను'' అన్నాడు.

''కనుక్కోవటం కాదు గట్టిగా పెట్టండి గడ్డి! తాళికట్టిన దాన్ని ఆమాత్రం వెనకేసుకువస్తే తప్పేం కాదు-అమ్మా నాన్న అని పూరుకోండే కాదు! సమయం వచ్చినప్పుడు తనవాళ్ళని చూడకూడదు! యిందులో మీది మాత్రం ఏంవుంది? ఎవరికర్మకి ఎవరు కర్తలు. మీరు వెనకాడవద్దు'' అంటూ గీతోపదేశం చేసింది కృష్ణవేణి.

''అలాగే'' అన్నాడు అర్జునరావు.

''అలాగే అంటేకాదు. తీరా రేపు ఎదురుపడ్డాక మా అమ్మా మా చెల్లి అని పూరుకోకూడదు! మళ్ళీ చెపుతున్నాను... ఎంత అయినవాళ్ళయినా!' అంటూ యధాశక్తి తనకి తెలిసిన ధర్మాలన్నీ చెప్పి రణరంగానికి అర్జునరావును సిద్ధంచేసింది కృష్ణవేణి.

తెల్లవారింది.

''అబ్బాయ్ యీఏడన్నా పదారు ఫలాల నోము ఉద్యాపన తీర్చుకోవాలరా! నాతోటి వాళ్ళంతా ఏనాడో తీర్చుకున్నారు!'' అంది తల్లి

''కొని పెట్టే కొడుకుంటే పదారుఫలాలేం ముప్ఫయిరెండు ఫలాల నోమును నోచుకోవచ్చు'' అంటూ అర్జునరావుకు వినబడేటట్లు గొణిగింది కృష్ణవేణి.

''ఏమిటో అంటున్నావు?'' అంది తల్లి.

''యింకేముంది? ఏదో నూరి పోస్తోంది మనమీద'' అంది చెల్లి.

''అంతేలే నాయనా! పెళ్ళాం బెల్లమనీ, తల్లి విషమనీ ఊరికే అన్నారా?ఆ చిత్రాంగి మాటలు విని...''

''చూశారా చూశారా ఎన్ని మాటలు అంటున్నారో వుట్టి పుణ్యానికి! ఊరుకుంటారేం. రాత్రి చెప్పిందంతా మర్చి పోయారా? నాలుగూ అడగండి'' అంది కృష్ణవేణి అర్జునరావును ముందుకు తోస్తూ.

''అది కాదమ్మా''

''అను నాయనా అను! చివరకు కన్న వాళ్ళం మేం లోకువై పోయాం. మా కర్మ!'' అంది తల్లి కళ్ళ నీళ్ళు జలజలా రాలుస్తూ.

ఒక పక్క భార్య ఉరిమి చూస్తోంది-మరోపక్క తల్లీ, తండ్రీ, చెల్లీ తన వంక కోపంగా చూస్తున్నారు! బట్టలు చింపుకుని జుట్టుపీక్కొని 'జై పరమేశ్వరా!' అంటూ హిమాలయాల్లోకి పరిగెత్తాలనిపించింది. అర్జునరావుకి. గబుక్కున యింట్లోంచి బయట పడ్డాడు. హిమాలయాలకు దోవ వెదుక్కుంటూ! యుద్ధం సాగుతూనే వుంది యింట్లో. మిగతా వాటాల వాళ్ళంతా ఉచితంగా చూపబడుతున్న యీ వినోద ప్రదర్శనని తమ తమ పనులన్నీ మానుకొని మార్నింగ్‌షో చూసినట్లు చూసి ఆనందిస్తున్నారు!

రోడ్డు మీదకొచ్చి, అర్జున రావు జేబులు తడుముకున్నాడు. హిమాలయాలకు వెళ్ళాలంటే డబ్బులావుగా వుండాలికదా! తనపర్సు అంత లావుగా లేదు?...కాస్త తగ్గాడు. సిగరెట్టు వెలిగించి ఒక దమ్ము లాగేసరికి మరింత స్థిమిత పడ్డాడు. ఉద్రేకం తగ్గింది. హిమాలయాలకు కాకపోయినా ''హిమాలయ్‌కీ లడ్కీ'' అనే గొప్ప హిందీ సస్పెన్సు పెక్స సినిమా చూడటానికి గబాగబా ఆ హాలువైపు అడుగులు వేయడం ప్రారంభించాడు.